ప్రజాశక్తి
శనివారం 24 డిసెంబరు 2022



పవన్ సభకు అనుమతి మంజూరు చేయాలి

శ్రీకాకుళం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జనవరి 12వ తేదీన రణస్థలంలో నిర్వహించే యువశక్తి కార్యక్రమానికి సంబంధించి అనుమతి మంజూరు చేయాలని, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని ఆ పార్టీ నాయకులు ఎస్‌పి జి.రాధికకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె ఛాంబరులో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్‌పిని కలిసిన వారిలో పిఎసి సభ్యులు కోన తాతారావు, యువశక్తి కమిటీ సభ్యులు పి.వి.ఎస్.ఎన్ రాజు, నాయకులు కాంతి, ఎన్ని రాజు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

కార్యకర్తలకు నిరాశే

- కన్వీనర్లు, గృహ సారథుల పైనే మాట్లాడండి
- వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో బొత్స సత్యనారాయణ ఆదేశం
- సమస్యలు చెప్పకునేందుకు అవకాశం ఇవ్వని వైనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పార్టీ పరంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను చెప్పుకోవడానికి ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలకు విస్తృతస్థాయి సమావేశమే వేదిక. ఎమ్మెల్యేలతో తమకున్న ఇబ్బందులను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లడానికి అంతకుమించిన సందర్భం వారికి ఉండదు. అటువంటి సమావేశంలోనూ తమ సాదకబాధకాలను చెప్పుకోవడానికి అవకాశం చిక్కలేదు. తమ ఇబ్బందులను ఏకరువు పెట్టేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి గంపెడాశలతో వచ్చిన కార్యకర్తలకు నిరాశే మిగిలింది. తాము చెప్పిందే తప్ప కార్యకర్తలు చెప్పేందుకు వీల్లేకుండా వైసిపి విస్తృతస్థాయి సమావేశం సాగింది. పార్టీ రూపొందించిన కన్వీనర్లు, గృహ సారథుల అంశంపైనే మాట్లాడాలని, ఇతర అంశాలేవీ వద్దంటూ కండీషన్లు పెట్టి అసంతృప్తిని వెళ్లగక్కనీయకుండా జాగ్రత్త పడ్డారు.

శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కళా వేదికలో శుక్రవారం నిర్వహించిన వైసిపి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో తొలుత పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ మాట్లాడిన తర్వాత వేదికపై ఉన్న వారిలో స్పీకర్ సీతారాం, మంత్రి ధర్మాన, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌తోనే మాట్లాడించారు. కార్యకర్తలతో మాట్లాడించకుండా నేతలే మాట్లాడి ముగిస్తే విమర్శలు వస్తాయన్న ఉద్దేశంతో కొందరితో మాట్లాడిస్తామని చెప్పి మైక్ అందించారు. మైక్ ఇస్తూనే కన్వీనర్లు, గృహ సారథుల నియామకాలపై మాత్రమే మాట్లాడాలని బొత్స షరతులు విధించారు. తొలుత ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన కంచిలి మాజీ ఎంపిపి ఇప్పిలి కృష్ణారావు మాట్లాడుతూ కన్వీనర్లు, గృహ సారథుల నియామకాల్లో జెడ్‌పిటిసిలకు భాగస్వామ్యం ఉందా అని ప్రశ్నించారు. ఉందని బొత్స బదులివ్వగా, తనకు ఇప్పటివరకు చెప్పలేదన్నారు. ఇప్పటికే నియామకాలు అయిపోయాయని కృష్ణారావు చెప్పగా, ఇన్‌ఛార్జి మంత్రిగా తాను చెప్తున్నానని అవ్వలేదన్నారు. నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉండొద్దని చెప్తూనే మైక్ తీసుకున్నారు. ఇక అక్కడ నుంచి ఒక్కొక్కరుగా తమ సమస్యలను చెప్పుకునేందుకు ముందుకొచ్చారు. పొందూరు మండలం బురిడికంచరాం సర్పంచ్ ప్రతినిధి జి.రమేష్ మాట్లాడుతూ కార్యకర్తలతో పాటు రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారని చెప్తుండగా అవేమీ చెప్పొద్దని, ఇంకొకరికి మైక్ ఇవ్వాలని బొత్స సూచించారు. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం సర్పంచ్ అశోక్ చక్రవర్తి మాట్లాడుతూ పెన్షన్లు రావడం లేదంటూ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కార్యకర్తలు సమస్యలు చెప్పుకుంటున్న తరుణంలో బొత్స తీవ్రంగా స్పందించారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వకపోగా, ప్రశ్నించిన వారినే నిందిస్తుండడంతో మిగిలిన వారు వెనక్కి తగ్గారు. తన మాటలతో ఎవరికైనా బాధ కలిగితే అపార్థం చేసుకోవద్దు అంటూ చివరిలో బొత్స కార్యకర్తలకు ముక్తాయింపునిచ్చారు.



కార్యకర్తలు నిరాశలో ఉన్నారని చెప్తున్న బురిడి కంచరాం సర్పంచ్ ప్రతినిధి రమేష్

సచివాలయం యూనిట్‌గా పార్టీ బలోపేతం

- ఒక్కో సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు
- వాలంటీరు పరిధిలో ఇద్దరు గృహ సారథులు
- సమన్వయకర్తలకు ఎమ్మెల్యేలు సహకరించాలి
- వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పార్టీలో ఇకపై గ్రామ, బూత్ కమిటీలు ఉండవని, సచివాలయాల పరిధిలోనే పార్టీని పటిష్టం చేసేలా ఒక కార్యక్రమం రూపొందించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వైసిపి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ వెల్లడించారు. శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కళా వేదికలో శుక్రవారం నిర్వహించిన వైసిపి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లను నియమించుకోవాలని, అందులో ఒక మహిళ ఉండాలని సూచించారు. కన్వీనర్ల నియామకాలను ఈనెల 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం చెల్లించనున్న రూ.2,750 పింఛన్ పంపిణీ కార్యక్రమంలో వాలంటీర్లతో పాటు వీరూ వెళ్తారని చెప్పారు. జనవరి ఒకటి నుంచి 16వ తేదీ లోపు వాలంటీరు పరిధిలో ఇద్దరు గృహ సారథుల నియామక ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎస్‌హెచ్‌జిలకు ఫిబ్రవరి 29న ప్రభుత్వం చెల్లించనున్న ఆసరా మూడో విడత కార్యక్రమంలో వీరంతా ఇంటింటికీ వెళ్తారని తెలిపారు. కన్వీనర్లు, గృహ సారథుల నియామకాల కార్యక్రమం ముందుకు సాగడానికి ఎనిమిది నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించామన్నారు. ఎమ్మెల్యేలు వారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

పార్టీలో సమన్వయంతో కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం పెద్ద కష్టం కాదని, రెండోసారి గెలిచినప్పుడే రాజకీయ జీవితం సాఫీగా సాగుతుందని చెప్పారు. తాను లేకపోతే పార్టీ లేదనే భావనలో ఉండొద్దని నాయకులు, కార్యకర్తలకు హితవు పలికారు. జిల్లాలో త్వరలో నియోజకవర్గాల వారీగా విస్తృత సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. కన్వీనర్లు, గృహ సారథులకు పార్టీ లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. కన్వీనర్లకు రాష్ట్ర పార్టీ ప్లీనం, ఇతర సమావేశాల్లో, గృహ సారథులకు అవకాశాన్ని బట్టి పార్టీ సమావేశాల్లో భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. రాష్ట్ర రాజకీయ చరిత్ర పుటల్లో టిడిపి ఇక ఉండదని చెప్పారు. 2024లో జరిగే ఎన్నికలే టిడిపికి చివరివని తెలిపారు.

ఎన్నికలకు పటిష్ట సైన్యం

ఎన్నికలకు పటిష్టమైన సైన్యాన్ని తయారు చేసే ప్రక్రియలో భాగంగానే కన్వీనర్లు, గృహ సారథులను నియమించాలని పార్టీ భావించిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. రాజకీయ సభలన్నింటికీ జనం వస్తున్నారని, అందరూ ఓటేయరని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే తాము గడప గడపకు వెళ్లగలుగుతున్నామని, టిడిపి నాయకులు ఎవరైనా వెళ్లగలరా అని ప్రశ్నించారు.

కన్వీనర్లు, గృహ సారథుల నియామకం ఎన్నికల కోసం చేస్తున్న నెట్‌వర్క్ అని, దీని ప్రయోజనాన్ని అందరూ అర్థం చేసుకోవాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. పంచాయతీల్లో వీరు జోక్యం చేసుకోరని, ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎవరు అందిస్తున్నారో లబ్ధిదారునికి అవగాహన కల్పించేలా చురుకైన వారిని ఎంపిక చేసేందుకే దీన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ ప్రాంత పర్యటనకు వచ్చిన చంద్రబాబు రాజధానిపై బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, కార్పొరేషన్ల ఛైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పనిచేయని అధికారులపై వేటు

- 56 లేఅవుట్లలో నెలలోగా గృహాలు గ్రౌండింగ్ కావాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్
- రణస్థలం తహశీల్దార్‌కు షోకాజ్ నోటీసు
- బెజ్జిపుట్టుగ ఇఎ సస్పెన్షన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గృహ నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ గృహనిర్మాణ శాఖ కార్య, ఉప కార్యనిర్వాహక ఇంజినీరింగ్ అధికారులను హెచ్చరించారు. 90 రోజుల్లో ఇళ్ల పట్టాలను జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించిన రణస్థలం తహశీల్దార్‌కు షోకాజ్ నోటీసు, లక్ష్యాల సాధనలో వెనుకబడిన బెజ్జిపుట్టుగ ఇంజినీరింగ్ సహాయకుడిని సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణాలపై ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న గృహ నిర్మాణ కార్యక్రమంలో పురోగతి కనిపించకపోవడం విచారకరమన్నారు. ప్రతి వారం సమీక్షించుకుంటూ ప్రగతిని కనబరచాలని, ఇందుకు సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. డిసెంబరులో ఇచ్చిన లక్ష్యాల్లో జిల్లా వెనుకంజలో ఉందని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల్లోనూ 4,549 పూర్తి కాలేదని చెప్పారు. ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందించి రెండేళ్లు గడిచినా, నేటికీ నిర్మాణాలు పూర్తి కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

లేఅవుట్ల గృహ నిర్మాణాల్లో జిల్లా వెనుకంజలో ఉందని, స్పెషల్ డ్రైవ్ క్రింద దీన్ని చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 56 లేఅవుట్లలో గృహ నిర్మాణాలు నేటికీ ప్రారంభం కాలేదని, నెల రోజుల్లోగా గ్రౌండింగ్ కావాలని, రెండు నెలల్లోగా నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. ప్రగతిని కనబరిచిన అధికారులను ప్రోత్సహిస్తూనే పనిచేయని అధికారులపై వేటు తప్పదని హెచ్చరించారు. గృహాలు నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జియోట్యాగింగ్, మ్యాపింగ్ పూర్తి చేయాలని, ఇందులోనూ నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణాలకు నిధుల కొరత లేదని, ప్రస్తుతం రూ.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జిల్లాలో మంజూరు చేసిన గృహాలన్నీ వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ పీడీ గణపతిరావు, కార్యనిర్వాహక, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రైతులు ఇబ్బందులు పడితే అధికారులదే బాధ్యత
- జిల్లాలో 1.64 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- ఆర్‌బికెల ద్వారా రైతులకు మద్దతు ధర
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - పలాస, మందస

ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటే, అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ధాన్యం సేకరణపై కాశీబుగ్గలోని ఒక కళ్యాణ మండపంలో పలాస డివిజన్ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మందస మండలం సొండిపూడిలో ఆర్‌బికెని ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామని, ఇప్పటివరకు 12 శాతం కొనుగోలు చేసినట్లు వివరించారు. జనవరి 30వ తేదీ నాటికి ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రైతులే రవాణా ఛార్జీలు, కూలీల ఖర్చులు భరిస్తే వారికే ఆ డబ్బులను చెల్లించనున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు పలాసలో ఒక్క శాతం కూడా ధాన్యం కొనుగోలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కుంటిసాకులు చూపి ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుభరోసా కేంద్రాల్లో ఒకసారి ధాన్యం నాణ్యత పరిశీలించాక తప్పనిసరిగా మిల్లర్లు ఆ ధాన్యాన్ని తీసుకోవాలని ఆదేశించారు. అందుకు సిఎస్ డిటిలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజుల్లో డబ్బులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారానే ధాన్యం రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శ్రీధర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జయంతి, డిఎస్‌ఒ వెంకటరమణ, ఆర్‌డిఒ పి.సీతారామ్మూర్తి, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, నందిగాం మండలాల తహశీల్దార్లు, ఎంపిఇఒలు, వ్యవసాయ శాఖ అధికారులు, పిఎసిఎస్ సిఇఒలు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ గణేష్

11, 12న వాలీబాల్ టోర్నమెంట్

డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.గణేష్

ప్రజాశక్తి - టెక్కలి

సంక్రాంతి సంబరాల్లో భాగంగా టెక్కలి నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను జనవరి 11, 12 తేదీల్లో టెక్కలిలో నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్జాన దుర్గాప్రసాద్ వెల్లడించారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన డివైఎఫ్ఐ సమావేశంలో వారు మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే వారు ఈనెల 25 నుంచి జనవరి ఎనిమిదో తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని స్పష్టం చేశారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.పది వేలు, ద్వితీయ బహుమతి రూ.ఐదు వేలు, తృతీయ బహుమతి రూ.మూడు వేలతో పాటు మెమోంటోలను బహుకరించనున్నట్లు తెలిపారు. ఉత్తమ ఆటగాడికి రూ.వెయ్యి నగదు, మెమోంటో ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 6305676125, 9666660942 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. టోర్నమెంట్‌ను జయప్రదం పిలుపునిచ్చారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు బి.ధర్మారావు, ఆర్.మహేష్, ఎ.ప్రసాద్, పి.గిరిబాబు, సిహెచ్.సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

26న పిసిసి అధ్యక్షుడు రుద్రరాజు రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పద్మరాజు ఈనెల 26న జిల్లాలో పర్యటించనున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి తెలిపారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో పార్టీ శ్రేణులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 26న ఉదయం పది గంటలకు ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో విలేకరుల సమావేశ అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం టెక్కలిలో జన జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహించే సమావేశంలో, రాష్ట్ర విభజన హామీల సాధన తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అనకాపల్లి డిసిసి అధ్యక్షులు శ్రీరామ్మూర్తి, గంప గోవిందరాజులు, శ్రీనివాస్, సనపల అన్నాజీరావు, అంబటి కృష్ణారావు, కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు.



సత్యవతిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఎనిమిది గంటలు పనిచేస్తే గరిష్ట కూలి

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - పొందూరు

ఉపాధి హామీ కూలీలు గరిష్టంగా రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తే రూ.257 కూలి లభిస్తుందని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు తెలిపారు. మండలంలోని లక్ష్మీపేటలో ఉపాధి హామీలో భాగంగా చేపడుతున్న చెరువు పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉపాధి హామీలో కూలీలే యజమానులన్నారు. ఇతర పనులకు వెళ్తే అక్కడ ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్బంధంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఉపాధి హామీ పనులు మాత్రం కూలీల అభీష్టానికి అనుగుణంగా చేసుకోవచ్చని చెప్పారు. సమయపాలన పాటించకుండా పనులు చేస్తే కూలి గిట్టుబాటు కాదన్నారు. కార్యక్రమంలో ఎపిడి శైలజ, ఎంపిడిఒ హరిహరరావు, ఎపిఒ శ్రీనివాసరావు, ఇసి నటరాజ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

త్వరితగతిన అర్జీల పరిష్కారం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - హిరమండలం

పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. హిరమండలం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, ముఖ్యమైన కేసు ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది పనితీరును సమీక్షించి, ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదులు, వాటిని పరిష్కరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కానిస్టేబుళ్లు వారి దత్తత గ్రామాలను ఎప్పటికప్పుడు సందర్శించాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నేర నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వంశధార గొట్టాబ్యారేజీని సందర్శించి ఎటువంటి నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.



గొట్టాబ్యారేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లావ్యాప్తంగా ఐసిడిఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న 77 అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి శుక్రవారం విడుదల చేశారు. 16 అంగన్వాడీ కార్యకర్తలు 16, సహాయకులు 60, ఒక మినీ అంగన్వాడీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగిన స్థానిక వివాహిత మహిళా అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు. కార్యకర్త పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు, మినీ, ఆయా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన నియామకాలు చేపడుతున్నట్లు చెప్పారు.

ఐసిడిఎస్ ప్రాజెక్టును యూనిట్‌గా పరిగణించి, సంబంధిత కేటగిరీ అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్థానికత ఉన్న వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులు ఈనెల 23 నుంచి 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తులను సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అందజేయాలని సూచించారు. ఇంటర్వ్యూ స్థలం, తేదీని తర్వాత ప్రకటిస్తామని తెలిపారు.

శాంతి సౌభ్రాతృత్వానికి క్రిస్మస్ ప్రతీక

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

శాంతి, సౌభ్రాతృత్వానికి క్రిస్మస్ ప్రతీకగా నిలుస్తుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. నగరంలోని కరుణ సమాజంలో రెడ్‌క్రాస్, అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కేకును కట్ చేసి పిల్లలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. కోవిడ్ మళ్లీ మొదలైందని, ప్రతిఒక్కరూ సామాజిక దూరం పాటిస్తూ, మాస్కులు ధరించి, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు తమకు అంత్యోదయ కార్డులు, తమ పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. లెప్రసీ కాలనీ అధ్యక్షులు పాపారావు కాలనీలో సమస్యలు వివరించారు. రోగులకు దుప్పట్లు, రగ్గులు, బియ్యం, చీరలు, నూనె, హైజీన్ కిట్లు పంపిణీ చేశారు. అనంతరం 45 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు కందిపప్పు, గోధుమపిండి, గోధుమనూక, నూనె, సేమ్యా, సగ్గుబియ్యం, బెల్లం, పంచదార, బియ్యం, చెప్పులను అందజేశారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, అప్‌హోల్డ్ ఛైర్మన్ అంజూరి ఫిలిప్ తిమోతి, స్వర్ణకుమారి, సత్యనారాయణ, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు నిక్కు అప్పన్న, శ్రీకాంత్, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



కిట్లు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

'మహోన్నత శిఖరాలు' బహుకరణ


ఆనంద్‌కు పుస్తకాన్ని బహుకరిస్తున్న రాజారావు

ప్రజాశక్తి - పొందూరు

విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయిత మహాసభలలో శ్రీకాకుళం శ్రీ కళావేదిక ప్రధాన కార్యదర్శి వావిలపల్లి రాజారావు రాసిన మహోన్నత శిఖరాలు(కవితా సంపుటి)ని సిలికాన్ ఆంధ్రా అధ్యక్షులు కూచిబొట్ల ఆనంద్‌కు బహూకరించారు. ఈ సందర్భంగా రాజారావు మాష్టారి కవితా వైదుష్యాన్ని ప్రశంసించారు. ఇంకా మరెన్నో రచనలు చేసి సాహిత్య శిఖరాలను అందుకోవాలని ఆయనను ఆశీర్వదించారు. ఆయనను సీనియర్ రచయితలు మహమ్మద్ రఫీ, వాండ్రంగి కొండలరావు, ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, బోచెల ఉమామహేశ్వరరావు, తదితరులు అభినందించారు.

కవితా సంకలనం ఆవిష్కరణ


కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

శ్రీకాకుళం: విజయవాడలో జరిగిన 5వ ప్రపంచ తెలుగు మహాసభల్లో సాహితీ చైతన్యకిరణాలు, బాల కథానిలయం వ్యవస్థాపక అధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 60 మంది కవులతో కవితా సంకలనం పుస్తకాన్ని విజయవాడకు చెందిన గండేపల్లి మల్లికార్జునుడు, హైదరాబాద్‌కు చెందిన మోటూరు నారాయణరావు, తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పి.వి.దుర్గాప్రసాద్, పాలక దేవానంద్, తెప్పల కృష్ణమూర్తి, వి.రాజారావు, శ్రీకాకుళం గ్రంథాలయ సెక్రటరీ బుర్రి కుమార్‌రాజు, బెహరాఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఫ్రెంచ్‌కు చెందిన ఆచార్య డేవిడ్ డానియల్ పుస్తకాన్ని చదివి ఉమా కవిని అభినందించారు.

గాయత్రి కళాశాలలో ఫ్రెషర్స్ డే


అడ్డయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: మునసబుపేటలోని గాయత్రి కళాశాలలో కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థుల నూతన విద్యార్థుల ఆహ్వాన ఉత్సవాలు శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి స్వామినాయుడు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన, సీనియర్ విద్యార్థులతో పలు విషయాలపై మార్గదర్శనం చేశారు. గురజాడ విద్యాసంస్థలు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి తమ కాలపట్టికను తయారు చేసుకుని క్రమశిక్షణతో ముందుకెళ్లాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ అంబటి రంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి వంగా మహేష్ తదితరులు మాట్లాడారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ విభాగాధిపతి పి.సీతారామ నాయుడు, టి.బాలాజీ, ఎన్.మధు, పి.గీత, కె.రవికుమార్, ఎన్.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

29న ఎలక్ట్రానిక్స్ ఇంటర్నల్ ఫెస్ట్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చక్రవర్తి

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ ఇంటర్నల్ ఫెస్ట్ 'ఎలక్ట్రానికా-2022'ను ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ బి.చక్రవర్తి తెలిపారు. కళాశాలలో ఫెస్ట్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ ఫెస్ట్‌లో అనేక ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ ఫెస్ట్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకట అప్పారావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి పి.సంతోష్, పి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సత్యనారాయణకు కొవ్వొత్తుల నివాళి


నివాళులర్పిస్తున్న ఉన్నతి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

ప్రజాశక్తి - కవిటి

నవరస నట సార్వభౌమ కైకాల సత్యనారాయణకు కవిటి ఉన్నతి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఘన నివాళి అర్పించారు. శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తులతో అశ్రు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉన్నతి డ్యాన్స్ అకాడమీ ప్రిన్సిపాల్, తెలుగు ఉపాధ్యాయుడు పిబికె.శర్మ మాట్లాడుతూ సుమారు 700 సినిమాల్లో నటించి తన నటన, ఆహార్యం, వాచకంతో ఆబాల గోపాలాన్ని అలరించిన సత్యనారాయణ తెలుగు సినిమా చరిత్రలో అజరామరంగా నిలుస్తారని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు.

టెక్కలి: కైకాల సత్యన్నారాయణ మృతికి టెక్కలి సుదర్శన థియేటర్ యాజమాన్యం నీరాజనాలు పలికారు. శుక్రవారం థియేటర్ ఆవరణంలో సత్యన్నారాయణ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సత్యన్నారాయణ మృతి కళారంగానికి తీరని లోటని అన్నారు. ఆయన నటనని ప్రస్తుత కళాకారులు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో థియేటర్ యాజమాన్యం సత్తారు వెంకటరమణ, మేనేజర్ ఎన్.వి.రెడ్డి, బాలకృష్ణ, రామకృష్ణ, రమణ, జానీ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూ హక్కుతో మేలు


మధుబాబు

రణస్థలం: వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంతో ఎంతో మేలు కలుగుతుందని జిల్లా సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మధుబాబు బూరాడ పేర్కొన్నారు. శుక్రవారం రణస్థలం వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై ఆధారపడే రైతుల నుంచి, భూమిపై పెట్టుబడి పెట్టె ప్రజల వరకు ప్రతి ఒక్కరూ కోరుకునేది తమ ఆస్తి పరిరక్షించబడాలని అన్నారు. రీసర్వే ద్వారా ఆ కల నెరవేరుతున్నందుకు అన్ని వర్గాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారన్నారని తెలిపారు. వందేళ్లకు ముందు జరిగిన సర్వే ప్రక్రియ కంటే సాంకేతికత కారణంగా ఇప్పుడు రీ సర్వే త్వరగా అవుతున్నప్పటికీ, ప్రక్రియలో కచ్చితత్వం కోసం సర్వేయర్స్ మరికొంత అదనపు సమయం ఇవ్వాలని కోరుతున్నారని అన్నారు. కొన్ని జిల్లాల్లో వలసలు కారణంగా ప్రజానీకం అందుబాటులో ఉండటం లేదని, మరి కొన్ని ప్రాంతాల్లో భూమి విలువ అధికంగా ఉండటంతో హద్దు తగాదాలు సద్దుమణిగే వరకు సర్వే ప్రక్రియ ఆలస్యం అవుతుందని సర్వేయర్స్ చెబుతున్నారని అన్నారు. తీవ్ర పని ఒత్తిడి నేపథ్యంలో కొందరు సర్వేయర్స్ అనారోగ్యంతో చనిపోతున్నారని, మరికొందరు ప్రమాదాల బారిన పడ్డారని తెలియజేశారు. జంగిల్ క్లియరెన్స్‌కు సరిపడా నిధులు, బాధ్యత సర్వేయర్స్‌కి ఇవ్వకపోవడం వల్ల ప్రమాదకరమైన జంతువులు, విషపూరిత పాముల భయంతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. సర్వేయర్స్‌కు రిస్క్ అలెవెన్సు ఇవ్వాలని, ప్రభుత్వం ఆమోదించిన సర్వే శాఖ రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా అర్హతలు ఉన్న సర్వేయర్స్‌కు సత్వరమే ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి రూలర్: టెక్కలి మండల విద్యుత్ వినియోగదారులకు అది ఆంధ్రావీధి సమీపంలో అదనంగా 5ఎంవి కెవి ఏర్పాటులో భాగంగా 33/11 కెవి సబ్ స్టేషన్ టెక్కలి-2 శనివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సంపతిరావు శ్రీనివాస్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

కుదిరిన వేతన ఒప్పందం

పలాస : పలాస జీడి పరిశ్రమ, రైస్ మిల్ కార్మిక సంఘ పరిధిలోని రైస్ మిల్లర్ల యాజమాన్యంతో 2022-24 ఆర్థిక సంవత్సరానికి వేతన ఒప్పందం ఖరారైనట్లు కార్మిక సంఘ కార్యదర్శి బొమ్మాళి తాతయ్య తెలిపారు. శుక్రవారం దమయంతి రైస్‌మిల్ ఆవరణంలో రైస్ మిల్లర్లు, కార్మికుల మధ్య జరిగిన వేతన ఒప్పంద సమావేశంలో గత ఏడాది వేతనంపై 16శాతం పెంపుదలతో రానున్న ఏడాది రైస్‌మిల్ కార్మికుల వేతనాలు ఖరారు చేసినట్లు ఆయన చెప్పారు. రెండు పర్యాయాల వేతన ఒప్పందాల సమయంలో 13శాతం పెంపుదలతో వేతన ఒప్పందం జరిగిందని, ఈ సారి 16 శాతం పెంపుదలపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రైస్ మిల్ యాజమాన్యం తరుపున సంఘం జిల్లా కార్యదర్శి కెవి.గోపాల్, పలాస అధ్యక్షులు కార్యదర్శి డోకి రామారావు, సిందిరి కిషోర్, పెంట శ్రీను కార్మికుల తరపున సంఘ కోశాధికారి తామాడ కూర్మారావు, కార్మిక సంఘ పూర్వపు కార్యదర్శి అంబటి కృష్ణమూర్తి, కార్మికుల పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉంటేనే న్యాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వినియోగదారునికి చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే న్యాయాన్ని పొందే అవకాశం ఉంటుందని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ రఘుపాత్రుని చిరంజీవి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆసరా సంస్థ ఆధ్వర్యాన నగరంలోని గీతం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 లక్షల లోపు వస్తువులకు సంబంధించి జిల్లా కమిషన్ దష్టికి తీసుకురావచ్చునని, ప్రతి 10 లక్షలకు కేవలం 200 మాత్రమే కోర్టు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వినియోగదారులు న్యాయవాది లేదా స్వచ్ఛంద సంస్థలు స్వయంగా వారు కూడా రూపాయి ఖర్చు లేకుండా వినియోగదారుల కమిషన్ ద్వారా న్యాయం పొందే అవకాశం ఉందన్నారు. జిల్లా సివిల్ సప్లయ్స్ అధికారి డి.వి.రమణ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన లేకపోతే వినియోగదారుడు పోరాడే అవకాశమే ఉండదన్నారు. లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ వై.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తూనికలు, కొలతల్లో ఎటువంటి మోసాలు జరిగినా తమ దష్టికి తీసుకురావచ్చునన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు అవగాహనపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు చిరంజీవి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఆసరా జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఎజ్రా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, మీడియా జెఎసి కన్వీనర్ ఎస్.జోగినాయుడు, రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి ఫ్రెడరిక్, గీతం కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆసరా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చిరంజీవి

పలాస: వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై క్షేత్రస్థాయిలో అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జ్ రవిశంకర్ అన్నారు. శుక్రవారం పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి అధ్యక్షతన జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా ఫిర్యాదులు, సమాచార వివరాలు, ఇతర వినియోగదారుల హక్కుల అంశాలను వివరించారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని, డిసెంబర్ 24న జరుపుకుంటారని, వినియోగదారుల రక్షణ చట్టం, 1986ను 24 డిసెంబర్ 1986న అమల్లోకి తెచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని, ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎజిపి దేవరాజు, న్యాయవాదులు బిఆర్‌కె పట్నాయక్, ప్రభాకర్‌రావు, జిఎంఎస్ అనిల్ రాజు, కోత రజని, గణేష్, మహ్మద్ గని, అంది రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పలాస : సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి రవిశంకర్

వినియోగదారులు చైతన్యం కావాలని, అందుకు వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ ఎల్.వెంకటాచలం అన్నారు. శనివారం జాతీయ వినియోగారుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 గతం కంటే సత్వర న్యాయం అందిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వాణిజ్యశాస్త్ర విభాగం రోల్ ప్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు వినియోగదారుల రక్షణ, హక్కులు అనే అంశంపై ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్ పాడి, కో-ఆర్డినేటర్ పండి రామకృష్ణ, రాజనీతి శాస్త్రం అధ్యాపకులు సీతమ్మ, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు ఎస్.నాగేశ్వరరావు, జి.ఈశ్వరరావు, బి.రాధ, ఇతర అధ్యాపకులు సంతోష్‌కుమార్, లోకేష్, దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - పొందూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవనిఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి కె.కృష్ణారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో శుక్రవారం ప్రాధాన్యత భవన నిర్మాణ పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ భవన నిర్మాణాలు చేపట్టడంలో పొందూరు మండలం బాగా వెనుకబడి ఉందన్నారు. గ్రామాల్లో చేపడుతున్న సచివాలయ భవనాలు, వెల్‌నెస్, ఆర్‌బికె, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ భవనాలు, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ భవన నిర్మాణ పనులు ఇంకా ఎక్కడైనా ప్రారంభం కాకపోయినట్లు అయితే డిసెంబర్ 31లోగా ప్రారంభించాలని తెలిపారు. మండలంలో ఇప్పటివరకూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు పనులు ప్రారంభించని 14 మంది పంచాయతీ కార్యదర్శిలకు సోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకూ చేపట్టిన పలు భవనాలకు బిల్లులు అవ్వడం లేదంటూ పలువురు సర్పంచ్‌లు, ఏజెన్సీలు ఆయన దృష్టికి తీసుకువెళ్లగా బిల్లులు అప్‌లోడ్ చేశామని, వస్తాయని చెప్పారు. సమావేశంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైస్ ఎంపిపి వండాన శ్రీదేవి, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, పంచాయతీరాజ్ డిఇ ఆర్.సూర్యప్రకాష్, ఎఇలు సత్యనారాయణ, పాల్గుణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ చైతన్య, హౌసింగ్ ఎఇ ఎం.వెంకటరమణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కృష్ణారావు

భవనాలను పూర్తి చేయాలి

ఆమదాలవలస: త్వరితగతిన మండలంలోని ప్రభుత్వ భవనాలను పూర్తిచేయాలని మండల ప్రత్యేక అధికారి ఎం.కాళేశ్వరరావు అన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో మండల ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. కొన్ని గ్రామాల్లో కోర్టు కేసులు వలన పనులు నిలిచిపోయాయని ఇంజనీరింగ్ అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఒకవైపు సచివాలయ పరిధిలోని పనులను మరోవైపు బిఎల్‌ఒలుగా విధులు నిర్వహిస్తూ ఒత్తిడికి గురవుతున్నామని రామచంద్రపురం ఇంజినీరింగ్ అసిస్టెంట్ కూన మణికంఠ ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకురాగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులు, పాఠశాలలలో జరుగుతున్న నాడు నేడు, గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనులపై సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలను అందించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.రేణుక, తహశీల్దార్ గణపతి, మండల పరిషత్ పరిపాలనాధికారి వాసుదేవరావు, ఎపిఎం పైడి కూర్మారావు, ఎపిఒ సురవరపు లక్ష్మీనరసమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న కిరణ్‌కుమార్

ప్రజాశక్తి - జి.సిగడాం

జి.సిగడాం మండలం సిగడాం ఎపి మోడల్ స్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి చదువుతున్న 98 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేశామని అన్నారు. కార్యక్రమంలో జి.సిగడాం ఎంపిపి సత్యవతి, మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, వైసిపి మండల నాయకులు బి.వెంకటరమణ, బూత్ కమిటీ కన్వీనరు ఆబోతుల జగన్నాథం, టి.వెంకటరావు, మక్కా వెంకటసాయి, పల్లాడ సన్యాసిరావు, ప్రకాష్, గౌరి, తవుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : సిఎం జగన్ విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. బూర్జ మండలం ఓవిపేట మోడల్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బి.రామారావు, వైస్ ఎంపిపిలు జె.సూర్యారావు, కె.కృష్ణమనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బి.నారాయణమూర్తి, సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, సింగపురపు కోటేశ్వరరావు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎ.రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: రాష్ట్రంలో డిజిటల్ విద్య అమలు చేయాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి అందజేసిన ట్యాబ్‌లను ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హరిబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.బాలకృష్ణారావు, చిన్ని జోగారావు, జడ్యాడ జయరాం, ఎ.విష్ణు, ఎంఇఒ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నందిగాంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నందిగాం

క్రిస్మస్ వేడుకల్లో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు. పాస్టర్ కాలేబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేకును కట్ చేసి నిరుపేదలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకష్ణారావు, సర్పంచ్ జడ్యాడ జయరాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిటిసి అంబోడి విష్ణు, వైసిపి నాయకులు అక్కురాడ లోకనాథం, శ్రీనివాసరావు, సర్పంచ్ సన్యాసిరావు, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో జీడిలో దిగుబడులు

ప్రజాశక్తి - కవిటి

జీడి పంటలో ముందస్తు జాగ్రత్తలతో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆమదాలవలస కెవికె శాస్త్రవేత్త హరికుమార్ అన్నారు. మండల ఉద్యానశాఖ అధికారి మాధవీలత ఆధ్వర్యంలో చండిపుట్టుగ గ్రామంలో శుక్రవారం తోటబడి కార్యక్రమంలొ భాగంగా జీడిలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ మేలో జీడి పంట ముగిసిన నెల రోజుల తరువాత కొమ్మలు కత్తిరింపు ద్వారా చెట్టుకు ధారాళంగా గాలి, వెలుతురు అంది సరైన సమయంలో చిగురు తొడిగి పూత దశకు చేరుకుంటుందని తెలిపారు. జీడి పూత ప్రారంభమైన నుంచి టి దోమ, కొమ్మ-పుష్పాలను తొలిచే పురుగు, కాయ-గింజ తినే పురుగు, తామర పురుగు, పిండినల్లి తదితర రకాల కీటకాలు దాడిచేసి జీడిపంటను నష్ట పరుస్తాయని అన్నారు. వీటికి చిగురు దశలో మోనోక్రోటాఫాస్ లీటర్ నీటిలో 1.6ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని, పూత దశలో లాండా సైహాలోత్రిన్ లీటర్ నీటిలో 0.6ఎంఎల్, గింజకట్టే దశలో ప్రొఫినోఫాస్ లీటర్ నీటిలో 1ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.


రైతులతో మాట్లాడుతున్న హరికుమార్


పిండినల్లి ఆశించినట్టైతే అసిపేట్ లీటర్ నీటిలో 1.5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని, తామర పురుగులు ఆశించినట్టైతే మోనోక్రోటాఫాస్ లీటర్ నీటిలో 1.6ఎంఎల్ మిశ్రమం కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం ఉద్యాన పంటలైన కొబ్బరి, మామిడి, అరటి తదితర పంటలకు ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలు వివరించారు. ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై అందించే వివిధ పథకాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఒ పోలాకి మాధవీలత, వ్యవసాయ సహాయకుడు ఎన్ని గణపతి, ఎంపిఇఒ విష్ణు, రైతులు ఎన్ని అశోక్ కుమార్, బొర్ర వెంకటరమణ, ఎన్ని అప్పలస్వామి, రంగనాథం, రామకృష్ణ, వాసు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణం నిలిపివేత

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని కోటిపల్లి పంచాయతీ కుంటి చెరువులో నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులను అధికారులు నిలిపివేశారు. ఈనెల 22న 'చెరువులో చెత్త సంపద కేంద్రం నిర్మాణం' అంటూ ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. చెరువు గర్భాలు, గెడ్డ పోరంబోకు, వాగుల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ సుప్రీం కోర్టు ఉత్తర్వులను అనుసరించి నిర్మాణాలను నిలిపివేశారు. గ్రామంలో వేరే ప్రాంతంలో నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి అప్పగిస్తామని ఎంపిడిఒ హరిహరరావుకు తహశీల్దార్ రాంబాబు తెలిపారు.


చెరువులో నిలిపివేసిన చెత్త నుంచి సంపద కేంద్రం నిర్మాణ పనులు

రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారు

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విమర్శించారు. మందస మండలం పిడి మందసలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విధ్వంసాలు ఆగాలన్నా, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలన్నా సైకో వైసిపి ప్రభుత్వం పోవాలన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. చెత్తపై పన్ను వేసిన చెత్త సిఎం జగన్ అని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ మహిళలపై దాడుల్లో మొదటి స్థానంలో ఉందన్నారు. బీహార్, ఒడిశా కంటే మన రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని, దీన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ మూడున్నరేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేశారా?, ఒక్క పరిశ్రమనైనా నెలకొల్పారా?, అని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సైకో ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రెయ్య, మండల లచ్చయ్య, పులారి వీరాస్వామి, ముడిమించి నవీన్, కొర్రాయి షణ్ముఖ, తలగాన రాజశేఖర్, అగ్గున్న జయరాజు, సేనాపతి జయరాజు, మల్ల కల్యాణి, ముంజేటి దేవదాసు, సవర చంద్రశేఖర్, బురద హరి, తదితరులు పాల్గొన్నారు.


'ఇదేం ఖర్మ మన రాష్టానికి'లో శిరీష, తదితరులు

సమ్మెకు వెళ్తున్నాం

సిఐ, ఎంపిడిఒ, తహశీల్దార్‌కు నోటీసులు అందజేత

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రైస్ మిల్లు కార్మికులకు అక్టోబర్ 2022 నెలాఖరికి పాత వేతన ఒప్పందం పూర్తి అయనా ఇప్పటి వరకు కార్మికులకు వేతనాలు పెంచకుండా రైస్ మిల్లు యాజమన్యాం మొండివైఖరి అవలంబిస్తుందని అందుకే ఆనెల 20వ తేదీ లోగా తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించిన ఇప్పటి వరకు పట్టించుకోలేదని అందుకే నుంచి తమ విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొంటామని అందుకు తమరు తమకు సహకరించాలని సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ జామి ఈశ్వరమ్మకు, ఎంపీడీవో కె. ఫణీంద్రకుమార్‌కు, స్థానిక ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాషా. టెక్కలిసిఐ సూర్యచంద్రమౌళికి వినతి పత్రాలు అందజేయటం జరిగిందని రైస్‌మిల్లు కార్మికులు తెలిపారు. పాత వేతన ఒప్పందం పూర్తి అయి మూడు నెలలు గడుస్తున్నా ప్రస్తుతానికి రెండు సార్లు చర్చలు జరిపినా యాజమాన్యాల వైఖరి సంతృప్తిగా లేనందునా నేటి నుంచి తమ విధులను బహిష్కరించి శాతితంగా సమ్మెలో పాల్గొంటామని వినతి పత్రం ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొండు నీలన్న, సన్యాసి, ఆర్. శ్రీనివాసరావు, ఎస్. ఆనందరావు, పి. గోవిందరావు, కార్మికులు పాల్గొన్నారు.


సిఐకి సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

పశువుల అక్రమ రవాణా


వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పశువులు

ప్రజాశక్తి - పలాస

మండలంలోని లక్ష్మీపురం టోల్ గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న మూగజీవాలను శుక్రవారం వేకువజామున కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు వాహన తనికీలను చేపట్టారు. కంచిలి మండలం జాడుపూడి సంత నుండి విజయవాడ హనుమాన్ జంక్షన్‌కు డబుల్ డెక్కర్ కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 17 దున్నలు, 17 బర్రెలను తరలిస్తుండగా సిఐ వాహనాన్ని ఆపి పట్టుకున్నారు. కేసు నమోదు శారు.

గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు


గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి

నౌపడ: సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం రైల్వే గేటు సమీపంలోని చెరువు వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహన ప్రమాదంతో గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నౌపడ ఎస్ఐ మహమ్మద్ అలీ తెలిపిన వివరాలు ప్రకారం ద్విచక్ర వాహనదారుడు బైకు పైన ఒంటరిగా వెళ్తుండటంతో ద్విచక్ర వాహనం బోల్తాపడి వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు గుర్తించామని తెలిపారు. స్థానికులు 108 వాహనం ద్వారా టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడు హిందీలో మాట్లాడుతూ వివరాలు వెల్లడించే పరిస్థితిలో ఉన్నాడని, ప్రమాద వివరాలు ఆరా తీస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువకునికి..


పరామర్శిస్తున్న కూన రవికుమార్

బూర్జ : మండలంలోని సింగన్నపాలెం కూడలి వద్ద ఎదురుగా వస్తున్న బొలోరా యువకుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఉప్పినివలస గ్రామానికి చెందిన కరాపాటి కిషోర్ కొల్లివలస జంక్షన్ నుండి తన గ్రామానికి ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి వస్తున్నారు. సింగన్నపాలెం కూడలి వద్ద ఆమదాలవలస వైపు నుండి పాలకొండ వెళ్తున్న బొలోరో ఢీకొంది. కిషోర్ బలంగా దెబ్బలు తగిలాయి. కుడి కాలు పూర్తిగా విరిగింది. కుడి చేతికి దెబ్బలు తగిలాయి. స్థానికులు 108 సమాచారంతో రాగోలు జెమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న కూన రవికుమార్ యువకుడిని పరామర్శించారు. వైద్యం అందుతున్న తీరును వైద్యులతో మాట్లాడారు. ఈయనకు భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ అధ్వన్నంపై ఫిర్యాదు


ఇఒకు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

పొందూరు: మేజర పంచాయతీకి చెందిన సుమారు రూ.6 లక్షల విలువ చేసే వాటర్ ట్యాంకర్, ఫోర్ వీల్ తొట్టె అధ్వన్నమైందని, దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పంచాయతీ ఇఒ ఎస్.రమేష్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.. గత పంచాయతీ అధికారులు అలసత్వం, పంచాయతీ పాలకవర్గ నిర్లక్ష్యం కారణంగానే పంచాయతీకి చెందిన ఆస్తి కనిపించకుండా పోయిందని, అయినప్పటికీ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఫిర్యాదులో ప్రస్తావించారు. కనిపించకుండా పోయిన ట్యాంకర్, తొట్టెపై పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకుని ట్యాంకర్‌ను తిరిగి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటర్ల జాబితా నుంచి వారిని తొలగించండి


మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ వెంకటరమణ

మెళియాపుట్టి: చనిపోయిన వారిని ఓటరు జాబితా నుండి తొలగించాలని జెడ్‌పి సిఇఒ వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారిని తొలగించాలని, నూతనంగా ఓటరు నమోదు చేయాలన్నారు. తప్పు, ఒప్పులు సరిచూసుకొని సవరించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు తహశీల్దారు పి.సరోజిని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి ఆర్‌ఐ అన్నాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

'న్యూ ఇయర్ వేడుకలకు అందుబాటులో ధర్మాన'

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి కొత్త సంవత్సర వేడుకల్లో ధర్మాన ప్రసాదరావు అందుబాటులో ఉంటారని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు తెలిపారు. నగరంలోని టౌన్‌హాల్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొవిడ్ కారణంగా రెండేళ్ల పాటు ధర్మాన వేడుకలకు దూరంగా ఉన్నారని తెలిపారు. ఈసారి కొవిడ్ హెచ్చరికల నేపథ్యంలో వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించారని, పార్టీ శ్రేణులు, అభిమానుల కోరిక మేరకు పెద్దపాడులోని తన క్యాంపు కార్యాలయంలో వేడుకలకు హాజరవుతారని తెలిపారు. వేడుకలకు బొకేలు, స్వీట్లు, శాలువలు తీసుకురావద్దని ధర్మాన సూచించారని చెప్పారు. నిరాడంబరంగా వేడుకలను నిర్వహించుకున్నట్లు తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు చల్లా శ్రీనివాస్, మండవిల్లి రవి, గుడ్ల దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల అభివృద్ధికి కృషి

రణస్థలం: అరబిందో పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు, ఈ ప్రాంత అభివృద్ధికి యాజమాన్యం ఎంతో కృషి చేస్తోందని పరిశ్రమ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కార్పొరేట్ హెచ్‌ఆర్ యుఎస్‌బి రాజు అన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంపెనీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశాఖ క్లస్టర్ పరిధిలోని యూనిట్ల నుంచి జూనియర్, మేనేజ్‌మెంట్ స్థాయి, అసిస్టెంట్ మేనేజర్ డిప్యూటీ మేనేజర్, మేనేజర్‌లు 35 మందిని గుర్తించి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ ఫార్మా రంగంలో జరుగుతున్న మార్పులను ఆకళింపు చేసుకునే విధంగా, వారి నైపుణ్యం అన్నివిధాలా మెరుగుపరిచే బృహత్తర కార్యక్రమం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. ఆరు నెలల కాలవ్యవధిలో ఉద్యోగులకు "సైకో మెట్రిక్ టూల్స్, బిహేవియర్ ఎస్సెస్మెంట్, బిజినెస్ సిమ్యులేషన్స్, ఇంటరాక్షన్, నెగోషియేషన్ స్కిల్స్" వంటి అనేక కీలక అంశాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఇందుకొరకు "ఆరో అస్త్ర" అనే ఫౌండేషన్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నామని, సాయి ప్రియా రిసార్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు ఎస్.దామోదరన్, కె.పి.రవినాథశెట్టి, కె.కమలాకర్‌రెడ్డి, సుహాస్ రామ్, మెట్టు శ్రీనివాసన్, ఒంగోలు శేషసాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గులు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్ మెంట్ సెల్ అధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గులు పోటీలు ఆకట్టుకున్నాయి. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిగ్రీ విద్యార్థినులు వేసిన ముగ్గులను చూసి మెచ్చుకున్నారు. కార్యక్రమంలో సీతమ్మ, అధ్యాపక బృందం రామకృష్ణ, గణపతి, సంతోష్‌కుమార్, నాగేశ్వరరావు, దేవరాజు, లోకేష్, బృందావన్, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైస్ కార్డుల పంపిణీ


లబ్ధిదారులకు కార్డులు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

నౌపడ: సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన రైస్ కార్డులను సర్పంచ్ మోహన్‌రెడ్డి అధికారులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారులకు పథకాలు నేరుగా అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బివి.రాజు, విఆర్ఒ ఉమాపతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

26న మండల బడ్జెట్ సమావేశం

జలుమూరు: మండల ప్రజా పరిషత్ 2022-23 సవరణ అంచనా, 2023-24 బడ్జెట్ సమావేశం ఈ నెల 26వ తేదీ సోమవారం ఎంపిపి వాన గోపి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జివి.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సభ్యులు నిర్దేశిత సమయానికి హాజరుకావాలని కోరారు.

నూతన కమిటీపై సమీక్ష

ఇచ్ఛాపురం: బెల్లుపడలో నూతనంగా ఏర్పాటైన రైతు సంఘం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆ సంఘం కన్వీనరు జన్నెల ప్రసాదరావు ఆధ్వర్యాన ఎల్లమ్మ గుడి వద్ద రైతులతో సమావేశం అయ్యారు. అంతర్జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. అనంతరం రైతులు తమ సమస్యలకు పరిష్కారంపై కమిటీతో సమిష్టిగా కృషి చేయాల్సి ఉందన్నారు. ఆ మేరకు మండల, మున్సిపాలిటీ పరిధిలో నూతన కమిటీ ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. త్వరలో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో చిరంజీవి, ఎ.పీతాంబరరెడ్డి, దుర్గాసి పాపారావు, కూర్మారావురెడ్డి, దొరబాబు, చాట్ల లోహిదాసురెడ్డి, కోటేశ్వరరావు, విశ్వనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


పశువులకు వైద్యం అందిస్తున్న కిరణ్‌కుమార్

కోటబొమ్మాళి: గ్రామాల్లో వివిధ స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న పశుఉచిత వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని చీపుర్లపాడు సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ 202 పశువులకు గర్భశోక, నట్టల నివారణ, సాధారణ చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి బొడ్డు అప్పన్న, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు జి.తిరుమలరావు, ఎం.దుర్గాప్రసాద్, పశువైద్య సిబ్బంది కె.ముకుందరావు, ఎస్.చిరంజీవి, పి. నారాయణలు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలి

కోటబొమ్మాళి: కిష్టుపురంలో భూ సమస్యను పరిష్కరించాలని చిన్నసానకు చెందిన బలగ తులసిరావు, భగవతి ఎస్ఐ షేక్‌కాదర్‌భాషా, తహశీల్దార్ ఈశ్వరమ్మకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ స్థలం కొన్నామని కొందరు ఆక్రమించుకునేందుకు చూస్తున్నారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తహశీల్దార్ పరిశీలించి, చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు పాడుతా తీయగా

శ్రీకాకుళం అర్బన్ : నిరుపేద కళాకారులకు తమవంతు చేయూతనిచ్చేందుకు శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో పాడుతా తీయగా కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కూన అనిల్ కుమార్, బి.కార్తీక్ (మధు) ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిత్య ఈవెంట్స్ ఆధ్వర్యాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళా ప్రదర్శనలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొత్తూరు: మండల కేంద్రంతో పాటు పారాపురం, నివగాం, మెట్టూరులో ఉన్న ప్రధాన రహదారులపై సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ ఆర్.వేణు గోపాలరావు, ఎస్ఐ గోవింద్ వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్సు, ఇతర ధ్రువపత్రాలను పరిశీలించారు. పలువురి నుంచి రూ.16వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. మద్యం తాగి వాహనం నడిపే వారికి ఫైన్ వేసినట్లు సిఐ చెప్పారు.

ఘనంగా రైతు దినోత్సవం



ఆమదాలవలస: మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ రైతు దినోత్సవం - కిసాన్ దివాస్‌ను నాబార్డు ఎజిఎం వరప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దేశ ఐదో ప్రధానిచరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకొని డిసెంబర్ 23న కిసాన్ దివాస్‌ను జరుపుకుంటున్నామని తెలిపారు. జమీందారీ చట్టం రద్దు చేయడంతో కౌలుదారి చట్టం అమలు, రైతులకు బ్యాంకు రుణాలు అందించే విధానం తీసుకురావడంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించడం వల్ల రైతుబంధుగా ఆయనను పిలుస్తారని అన్నారు. భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా సాగు ఖర్చు తగ్గించి దిగుబడులు పెంచే దిశలో భాగంగా సేంద్రీయ వ్యవసాయంవైపు రైతులు మొగ్గు చూపించేందుకు కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. నాబార్డు ఎజిఎం వరప్రసాదరావు మాట్లాడుతూ రైతులకు రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రైతు ఉత్పత్తి సంఘాలకు, రైతులకు నిరంతరం నాబార్డు ద్వారా సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారు. సస్య పోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయంలో ప్రకృతి సిద్ధమైన ఎరువులు వాడి రసాయనిక కీటక నాశనములకు బదులు వృక్ష - జంతు సంబంధ జీవామృతం, సమస్తం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం వంటివి వాడటం వల్ల పెట్టుబడులు, కాలుష్యం తగ్గి నాణ్యమైన పంటలను సాధించవచ్చు అని ఎస్ఎంఎస్ సేద్య విభాగం రైతులకు తెలిపారు. కార్యక్రమంలో కెవికె మత్స్య శాస్త్రవేత్త సిహెచ్ బాలకృష్ణ, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష, ఏరువాక ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ జగన్నాథం, ఏరువాక విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పి.వెంకట్రావు, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, అభ్యుదయ రైతు బి.వి.రమణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం: రైతన్నల కష్టిని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో శుక్రవారం మాజీ ప్రధాని చరణ్ సింగ్ జయంతి సందర్భంగా "జాతీయ రైతు దినోత్సవాన్ని" నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబంలో జన్మించి భారత ప్రధాని పదవిని అలంకరంచిన చౌదరి చరణ్ సింగ్ కృషి ఫలితంగానే దేశంలో జమిందారీ చట్టం రద్దయి, కౌలుదారీ చట్టం అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన రైతు శ్రామికుల మధ్య మిత్ర అభ్యుదయ రైతు బి.లక్ష్మణరావు, ఇతర మహిళా రైతులతో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మిత్ర సమన్వయ కర్తలు పి.తవిటినాయుడు, బి.లక్ష్మీ నరసింహమూర్తి, ఎస్‌పి నారాయణ, గణేష్, ఆర్.కృష్ణ, పి.రమణ, రత్నాకర్, జి.భాను, తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని పెద్దతిమ్మాపురంలో హెచ్‌ం బాలక శంకరరావు ఆధ్వర్యాన రైతు దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా చరణ్ సింగ్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. రైతులు దేశానికి వెన్నెముక అని, వారిని మనం గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, సంధ్యారాణి, ధర్మారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు లేనిదే జీవితం లేదు


వరి చేను మోస్తున్న దాసరి రాజు, తదితరులు

కవిటి: రైతు అనేవాడు లేకపోతే జీవితమే భారమవుతుందని, తినేందుకు తిండిలేక జనం అల్లాడిపోతారని జనసేన నాయకులు దాసరి రాజు, లోళ్ల రాజేష్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా శుక్రవారం జనసేన నాయకులు మండలంలో రైతులతో మమేకమై వారి కష్ట సుఖాలు తెలుసుకున్నారు. రోజురోజుకీ వ్యవసాయం చేసేవారి సంఖ్య గణనీయంగా పడిపోతోందని, దీన్ని నివారించి రైతన్నకు పూర్తిస్థాయిలో భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, భవిష్యత్‌లో ఆ బాధ్యత జనసేన తీసుకుంటుందని వారు తెలిపారు. కుసుంపురం గ్రామంలో డిగ్రీ చదువుకుంటూ పొలంలో తల్లిదండ్రులకు సహాయపడుతున్న దుమ్ము శిరీష, రైతులు బత్తిన లోకేశ్వరారావు, కష్ణారావు, కేశవరావు, ఈశ్వరరావు, రుక్మిణీ తదితర రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, అంగ సురేష్‌కుమార్, పృధ్వీ, ప్రశాంత్, బెందాళం జయదేవ్, రొక్కళ్ల భాస్కరరావు, గుమ్మడి శ్యామ్, జుత్తు చలపతి, ఇద్ధి సురేష్, రామకృష్ణ, బడే రాజు, దేవా, మోహన్, నవీన్, రవి, చిట్టో బెహరా, రంజిత్, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని నగరపాలెంలో జనసేన నాయకులు కరిమజ్జి మల్లీశ్వరరావు అధ్వర్యంలో శుక్రవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పొట్నూరు లక్ష్మునాయుడు, జెఆర్.పురం నాయకులు దాసరి బలరాం, కె.వెంకటరమణ, జగన్నాథం, సత్యం, పోలినాయుడు, కెల్లా రామకృష్ణ, కె.భాస్కరరావు, రౌతు భద్రయ్య, గోవింద, రామునాయుడు, పార్వతమ్మ, లక్కీ, రామలక్ష్మి, మీసాల లక్ష్మమ్మ, గంట్యాడ దమయంతి, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: దాసరి రాజు సమక్షంలో బాసి భారతిరెడ్డి, రొక్కళ్ల భాస్కరరావు, రామకృష్ణ, దంగు భాస్కరరావు ఆధ్వర్యాన రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శుక్రవారం జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్నీసుపేట, బలరాంపురంలో రైతుల కష్టాలు తెలుసుకొన్నారు. ఇసురు మహాలక్ష్మి, దుంగు లక్ష్మమ్మ, దుక్క సీతమ్మ, శిరపు నరసింహులు, ఇసురు కుర్మయ్య, దండాసి కామమ్మ, దుంగు జోగమ్మ, మకరపల్లి సీతమ్మ, ఇసురు బలరాం, ఇసురు ధర్మ రావు, బాకీ తులసమ్మ, ఇసురు కాంతమ్మ, దుంగు సీతమ్మ, ఇసురు కూర్మారావుకు ఘనంగ సన్మానం చేశారు. కార్యక్రమంలో ఇసురు కూర్మారావు, ఇసురు ఆదినారాయణ, ఇసురు దామోదర్, సిరపు శేషగిరి, దుంగు కుమార్, ఇసురు ఋషి, ఇసురు ఢిల్లీస్, జనసైనికులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ, జనసేన ఆధ్వర్యాన కొల్లివలస, చీడివలస, ఒవి.పేటలో రైతు దినోత్సవం నిర్వహించారు. రైతుల కష్టాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 20 మంది రైతులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎన్.సన్యాసిరావు, కొల్లివలస ఎంపిటిసి విక్రమ్, బి.శంకరరావు, రైతులు పాల్గొన్నారు.

టెక్కలి: మండలంలోని తేలినీలాపురంలో రైతు దినోత్సవం నిర్వహించారు. జనసేన నాయకులు కణితి కిరణ్‌కుమార్ రైతులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. జనసేన అధికారంలోకి వస్తే రైతులకు కలిగే లబ్ధిని వివరించారు. అనంతరం పార్టీ జెండాను పొలం గట్లపై పాటారు. కార్యక్రమంలో పేడాడ త్రివేణిరావు, ఇలపండ రమేష్, కొత్తూరు హరి, సంతోష్, దినేష్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అందించాలి


మాట్లాడుతున్న వాసుదేవరావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించాలని నోడల్ ఆఫీసర్ వాసుదేవరావు అన్నారు. శుక్రవారం మండలంలోని వంజంగి, దూసి సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, ఎఎన్ఎంలు, వాలంటీర్లకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకం ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంలో అర్హులైన లబ్ధిదారులను చేర్పించాలని, తద్వారా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల ప్రజలకు బీమా సదుపాయాన్ని కల్పించవచ్చని తెలిపారు. ఈ పథకంలో 1350 రకాల వ్యాధులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఐదు లక్షల రూపాయల వరకు వైద్యం చేయించుకునే వీలున్నదని తెలిపారు. వైఎస్ఆర్ కళ్యాణమస్తు పథకానికి అర్హులైన వారికి ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.రేణుక, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వార్డునూ అభివృద్ధి చేస్తాం

పలాస: ప్రతి వార్డును అభివద్ధి చేస్తున్నామని, పార్టీలకతీతంగా వార్డులకు నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు పురుషోత్తపురంలో రూ.33 లక్షల వ్యయంతో నూతన రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిసి రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎస్.అమ్మోజి, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, మున్సిపల్ డిఇ బల్ల హరి, ఎఇ అవినాష్, ఎస్.నవీన్‌కుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



క్యాంపు వెళ్తే సమాచారం ఇవ్వాలి

టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి


మాట్లాడుతున్న సిఐ సూర్య చంద్రమౌళి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

న్యూఇయర్, సంక్రాంతి, తదితర పండగలకు ఇళ్లకు తాళం వేసి, దూర ప్రాంతాలకు వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని టెక్కలి సిఐ సూర్య చంద్రమౌళి అన్నారు. పోలీస్ స్టేషన్ అవరణలో శుక్రవారం ఎస్ఐ షేక్ ఖాదర్‌భాషా అధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో సిఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువగా పండగ సమయంలో ఇంటికి తాళం వేసి వెళ్లే ఇళ్లపై పోలీసు నిఘా పెడతామని అన్నారు. గ్రామాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరిగే చోట స్పీడ్ బ్రేకర్లు వేయాలని సూచించారు. సంక్రాంతి సందర్భంగా పేకాట, కోడి పందేలు అడినా, నిర్వహించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కువగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దుర్యోధనరావు

వరహాల గెడ్డపై వంతెన నిర్మించాలని వినతి

పలాస: మండలంలోని చినంచల వరహాలగెడ్డపై వంతెన నిర్మించాలని చినంచల ఎంపిటిసి బి.దుర్యోధనరావు డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో కలెక్టర్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ చినంచల వరహాలగెడ్డపై బ్రిడ్జి నిర్మాణం ద్వారా రాజగోపాలపురం, జగన్నాథపురం, చినంచల, గంగువాడ, లొద్దభద్ర, మరదరాజపురం తదితర ప్రాంతాల ప్రజలతో పాటు వందలాది మంది రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. సుమారు 250 మంది రైతులు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సంతకాలు చేయడం జరిగిందన్నారు. అందుకు ముఖ్యమంత్రి, నీటి పారుదలశాఖ మంత్రి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అధికారులు, పాలకులు చొరవ చూపాలని కోరారు. వినతి పత్రం అందజేస్తున్న వారిలో కూన హేమాచలం, దువ్వాడ నవీన్ చౌదరి, ఉప్పాడ రామా రావు కంచరాన జగన్ ఉన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పలాస

బీహార్ రాష్ట్రం పాట్నాలో ఫిబ్రవరి 15 నుండి 20 వరకు జరుగు సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ 11వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డు వాసుదేవరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బొడ్డపాడు పంచాయతీ మామిడిపల్లి గ్రామంలో జాతీయ మహాసభల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన స్వేచ్ఛ, సమానత్వం, సంఘీభావం లక్ష్యం దిశగా మహా సభలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ లీడింగ్ టీం కమిటీ సభ్యులు వంకల అప్పయ్య, లోకల్ కమిటీ సభ్యులు జడే జోగారావు, నేతాజీ, సార పాపయ్య, గేదెల జానకి రావు, వంకల పున్నయ్య, చంద్రరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.


మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన వాసుదేవరావు

ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలి


మాట్లాడుతున్న తమ్మినేని సుజాత

ప్రజాశక్తి - ఆమదాలవలస

పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వాన్ని త్వరలోనే సాగనంపాలని టిడిపి జిల్లా మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని 21వ వార్డు వెంగళరావు కాలనీలో ఆమె పర్యటించారు. వారు మాట్లాడుతూ పార్టీ ఆదేశానుసారం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే మాట మంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకుంటున్నామని, ఈ ప్రభుత్వ హయాంలో అధిక ధరలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని, నిత్యవసరాల ధరలు కొండెక్కి కూర్చున్నాయని గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రజలు బతికేదెలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సైకో పాలన పోయి సైకిల్ పాలన వచ్చిన నాడే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తమ్మినేని విద్యాసాగర్, టిడిపి నాయకులు రెడ్డి రాంబాబు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి


డ్వాక్రా సంఘాలతో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

డ్వాక్రా సంఘాలు పొందిన రుణాన్ని సకాలంలో చెల్లించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల సభ్యులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ఆర్ ఆసరా, సున్నీ వడ్డీ, రుణమాఫీ, వైఎస్ఆర్ చేయూత వంటి పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంకా వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని బ్యాంక్ రుణాలు అవసరాలకు అనుగుణంగా వాడుకోవాలని, రుణాలు తిరిగి చెల్లించేటప్పుడు క్రమం తప్పకుండా చెల్లిస్తే సంఘాల్లో ఎటువంటి సమస్యలు ఉండవని అన్నారు. రుణాలు వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిఎం ఎం.జానకిరావు, సిఒలు బాలరాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

గణితంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పొందూరు

విద్యార్థులు గణితంపై ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలని ప్రముఖ దశావధాని మడ్డు తిరుపతిరావు అన్నారు. మండలంలోని తాడివలస జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవంలో భాగంగా హెచ్‌ఎం లఖినాన హేమ నాచార్యుల ఆధ్వర్యాన శుక్రవారం దశావధానం నిర్వహించారు. ఈ సందర్భంగా గణితానికి సంబంధించిన పది అంశాల్లో విద్యార్థులు అడిగిన వివిధ రకాల ప్రశ్నలకు వెంటనే సమాధానాలను చెప్పారు. ఘనమూలం, పంచమమూలం, మ్యాజిక్ చతురస్రాలు, సరస గణితం, వేల శతాబ్దాల క్రితం తేదీలు, వారాలు, తదితర అంశాలపై ఉపాధ్యాయులు, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు పి.హరిప్రసన్న, సీహెచ్ వేణుగోపాల్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిఎల్‌డిఒ ఆకస్మిక తనిఖీ

పొందూరు: మండలంలోని కింతలి, కనిమెట్ట సచివాలయాలను శుక్రవారం జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి, డిఎల్‌డిఒ పి.వాసుదేవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయాపాలన పాటించాలని, సర్వీసులు సక్రమంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు ఎంపిడిఒ సీపాన హరిహరరావు, తదితరులు ఉన్నారు.

వృత్తి విద్య కోర్సు విద్యార్థుల క్షేత్ర పరిశీలన

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వృత్తి విద్య కోర్సు విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. సింధువాడ పంచాయతీలోని వీరమల్లిపేట, సింధువాడలో వారు పర్యటించారు. డివిఇఒ కోట ప్రకాశరావు ఆదేశాలతో ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు సూచనల మేరకు ఆన్ ద జాబ్ ట్రైనింగ్ శిక్షణ నిర్వహిస్తున్నామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్ తెలిపారు. సింధువాడ గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడి రోజువారీ కార్యకలాపాలను తెలుసుకున్నారు. సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులు, ఫైళ్లు చూసి అవగాహన కల్పించినట్లు రాంప్రసాద్ తెలిపారు. సరుబుజ్జిలి వైస్ ఎంపిపి గోవిందు శివానందమూర్తి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలను వివరించారు. రైతులకు అందిస్తున్న సబ్సిడీలు, యంత్ర పరికరాలు, పనిముట్ల కోసం సచివాలయ కార్యదర్శి బాలకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ సాయి, సిబ్బంది డబ్బీరు సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

రబీలో రైతులు సాగు చేసే పంటల వివరాలను ఈ-పంట నమోదు తప్పనిసరి అని ఎఒ దానకర్ణుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నుండి వచ్చే అన్ని పథకాలూ వర్తిస్తాయని తెలిపారు. రైతులు విధిగా మీ భూమి ఉన్నా గ్రామంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. జాడుపల్లి రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ-పంట ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈశ్వరి, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన


కళాజాతాను ప్రదర్శిస్తున్న కళాకారులు

కొత్తూరు: శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు కళాజాతా నిర్వహించారు. వ్యాధి వచ్చే మార్గాలు, లక్షణాలు, వ్యాధి నిర్ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిటిసి కౌన్సిలర్ సిహెచ్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఐటిసి కేంద్రంలో హెచ్ఐవి పరీక్షలు చేసుకొని స్టేటస్ తెలుసుకోవాలన్నారు. ఇది అంటూ వ్యాధి కాదన్నారు. జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమములో డిగ్రీ కళాశాల డైరెక్టర్ జి.కృష్ణారావు, అధ్యాపకులు జి.మహేశ్‌బాబు, సురేష్, ఆరోగ్య సిబ్బంది జనార్థనరావు, సర్వేశ్వరరావు, లత, శ్రీనివాస్ పాల్గొన్నారు.